24052025-DIS-06_Layout 1 5/24/2025 3:30 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

కాంగ్రెస్ దొడ్లో ఈనితే చాలా?

డాక్టర్ దాసోజు శ్రవణ్‌కుమార్

'ఏ దొడ్లో కడితే ఏంది, మా దొడ్లో ఈనితే చాలు' అనే సామెత కాంగ్రెస్ ప్రభుత్వానికి అచ్చుగుద్దినట్టుగా సరిపోతుంది. ఎందుకంటే.. ఈ ఏడాది రాష్ట్రంలో 170 లక్షల టన్నుల ధాన్యం పండిందని రేవంత్ సర్కార్ జబ్బలు చరుచుకుంటున్నది. ఈ అద్భుతం తమ వల్లే సాధ్యమైందని ప్రచారం చేసుకుంటున్నది కాబట్టి. ఇంతగనం గొప్పలకు పోవడానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఎన్నేండ్లయ్యింది? రెండేండ్లు కూడా సరిగా నిండలేదు. ఈ ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా నిర్మించిన నీటిపారుదల ప్రాజెక్టులెన్ని? కొత్తగా నీళ్లు పారించిన ఎకరాలెన్ని? ఒకసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా అవలోకనం చేసుకోవాలి.

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని తెలంగాణ ధాన్యసిరిని తన ఖాతాలో వేసుకుంటున్నది. సింహం తన చరిత్ర రాయకపోతే వేటగాడు చెప్పిందే చరిత్ర వుతుందంటారు కాబట్టి, ఈ వ్యాసం రాయాల్సి వస్తున్నది. 2014, జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పుడు ఈ ప్రాంతంలో 30 లక్షల టన్నుల వరి ధాన్యం పండితే మహా గొప్ప. అలాంటిది ఇప్పుడు అంతకు 6 రెట్ల వరి ధాన్య ం రాష్ట్రంలో దిగుబడి అవుతున్నది. అబద్ధాల, అసమర్థ కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలోనే ఇది సాధ్యమైందా? అని ఏ పసిపిల్లాడినడిగినా తక్కున కాదని చెప్తాడు. ఈ అద్భుతం కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే సాధ్యమైంది. అపరభగీరథుడైన కేసీఆర్ వల్లే సాధ్యమైంది. కాదని కండ్లున్న కాంగ్రెస్ కబోదులు అనవచ్చు. బీజేపీ వాళ్లూ అనవచ్చు. కానీ, రాష్ట్రంలో ఏ మారుమూల గ్రామానికైనా వెళ్లి రైతులను అడిగితే తమ గుండెల్లో గూడు కట్టుకున్న కేసీఆర్‌నే చూపిస్తారు.

బీఆర్ఎస్ పార్టీపై, మా అధినేత కేసీఆర్‌పై కుటిల పన్నాగం పన్నుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రశ్నలకు సమాధానం చెప్తాడా? ఒకవేళ కాళేశ్వరం ప్రాజెక్టే లేకపోయి ఉంటే రాష్ట్రంలోని చెరువులన్నీ ఎండకాలం కూడా నిండుకుండల్లా ఉండేవేనా? బీడు భూముల్లోనూ రైతులు రెండు పంటలు తీసేవారా? పదేండ్ల కిందట ఎడారిలా ఉన్న భూములన్నీ వరి పంటతో పచ్చగా కళకళలాడేవేనా? మరెందుకు కాళేశ్వరంపై ఇన్ని కుట్రలు? కాళేశ్వరం అవినీతి ప్రాజెక్టు అని కాంగ్రెస్ అంటే.. తందానా అని తలలూపుతున్న బీజేపీ సాగిస్తున్న ప్రచారం ఎందుకోసం? కేసీఆర్ ప్రతిష్ఠను దిగజార్చడం కోసమే ఈ రెండు జాతీయ పార్టీలు కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకుండా రైతుల బతుకులతో ఆటలాడుకుంటున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టును ఒక విఫల ప్రాజెక్టుగా చూపించడానికి ఎన్నో కుట్రలు చేస్తున్నాయి.

2013 అసెంబ్లీ ఎన్నికల ముందు మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాకు కుంగిపోవడమే ఒక మిస్టరీ. నాడు ఏదో బాంబు పేలినట్లు పెద్ద శబ్దం వచ్చిందని అక్కడి స్థానికులు చెప్పారు. పలు చర్చా కార్యక్రమాల్లో ప్రముఖ విశ్లేషకులు వి.ప్రకాశ్ కూడా ఆరోపించారు. కానీ, ఆ తర్వాతనే 2023 అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. కోడ్ కారణంగా ఈ అంశం ఎన్నికల కమిషన్ పరిధిలోకి వెళ్లిపోయింది. ఊహించినట్టుగానే కాంగ్రెస్ ఈ అంశమే ప్రధానంగా ఎన్నికల ప్రచారానికెత్తుకున్నది. ఒక్క పిల్లర్ కుంగితే మొత్తం ప్రాజెక్టే విఫలమైందని, కాళేశ్వరం కూలిపోయిందని, రూ.లక్ష కోట్లు వృథా అయ్యాయని అబద్ధపు ప్రచారం చేసింది. ప్రజలను తప్పుదోవ పట్టించింది. కాళేశ్వరం వల్ల పెరిగిన కేసీఆర్ ప్రతిష్ఠను గుర్తించి, ఆ ప్రాజెక్టు ఫలాలను అందించినంత కాలం ప్రజలు కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకుంటారని తెలిసే కాంగ్రెస్ ఈ బూటకపు ప్రచారానికి ఒడిగట్టింది. 'పోయిన వానకాలం మేడిగడ్డలో నీరు నిల్వ లేవు. అయినా పంటలు పండాయంటే కాళేశ్వరం పాత్ర ఏమీ లేనట్టే కదా' అని కొందరు కాంగ్రెస్ నేతలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల రాష్ట్ర వ్యాప్తంగా పెరిగిన భూగర్భ జలాలపై కాస్త

యినా అవగాహన ఉంటే వారు ఆ మాట మాట్లాడేవారు కాదు. కాళేశ్వరం నీళ్లతో కాలువలు పారాయి. చెరువులు నిండాయి. ఈ క్రమంలో ఆ మేర భూగర్భ జలాలూ పెరిగాయి. ఈ రోజు ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లోని బావుల్లో నీళ్లు ఉంటున్నాయంటే, గతంలో వట్టిపోయిన బోర్లు కూడా నేడు నిరంతరంగా నడుస్తున్నాయంటే దానికి కాళేశ్వరమే కారణం.

> కాళేశ్వరం అంటే మేడిగడ్డ బ్యారేజీ ఒక్కటేనా, కానే కాదు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఈ మూడు పెద్ద బ్యారేజీలు, 20 రిజర్వాయర్లు, 20 పంప్‌హౌజ్‌లు, 1,800 కిలోమీటర్ల మేర కాలువలు, పైపులైన్లు, సొరంగ మార్గాలు. 160 టీఎంసీల నీటిని ఎత్తిపోయడం, గోదావరి నీటిని ఎదురెక్కించి, ఎత్తుగడ్డ మీద ఉన్న మెదక్‌కు సాగునీళ్లు, హైదరాబాద్‌కు తాగునీళ్లు అందించడం. ఇదీ యావత్ కాళేశ్వరం ముఖచిత్రం.

ఇంత పెద్ద ప్రాజెక్టులోని ఒక బ్యారేజీలో, ఒక పిల్లరు కుంగిపోతే మొత్తం ప్రాజెక్టే కూలిపోయిందన్న దుర్మార్గపు ప్రచారంతో కాంగ్రెస్ రాజకీయ పబ్బం గడుపుకోవచ్చు. కానీ, ఆ పార్టీ ప్రజల విశ్వాసాన్ని మాత్రం గెలుచుకోలేదు. సరే, మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ కుంగిపోవడంలో మానవ కుట్ర లేదని కాసేపు అనుకుందాం. మరి ఏడాదిన్నర కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు? సాగునీటి ప్రాజెక్టుల్లో ఇబ్బందులు రావడం కొత్తేమీ కాదు. గతంలో నాగార్జునసాగర్‌లోనూ సమస్యలు వచ్చాయి. నాటి ప్రభుత్వాలు మరమ్మతులు చేయకుండా చోద్యం చేస్తూ కూర్చున్నాయా? వెంటనే మరమ్మతులు చేశాయి. మరి మేడిగడ్డకు కాంగ్రెస్ సర్కార్ ఎందుకు మరమ్మతులు చేయడం లేదు? అంటే, ఎక్కడో, ఏదో తేడా ఉన్నట్టే కదా? రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కుమ్మక్కై తెలంగాణలో కేసీఆర్ ఆన వాళ్లు లేకుండా చేయాలని కంకణం కట్టుకున్నాయి. అందుకే, మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని కాంగ్రెస్ ఇలా చెప్పిందో లేదో, కేంద్రం నుంచి హడావుడిగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అధికారులు పరుగెత్తుకువచ్చారు. కనీసం బ్యారేజీ నీళ్లలోకి దిగకుండానే, మట్టిని పరిశీలించకుండానే ఇంజినీరింగ్ లోపం ఉందని, ఇసుకలో కట్టారని మూడు రోజుల్లోనే తేల్చేశారు. అరే.. నిజమా అని, విచారణ పేరుతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంక్వైరీ కమిషన్ వేసింది. ఆ కమిషన్ ఏడాదిగా విచారణ చేస్తూనే ఉన్నది. కానీ, అసలు లోపం ఎక్కడ ఉందనేది చెప్పలేక గడువు మీద గడువు పొడిగించుకు పోతున్నది. కాంగ్రెస్ చెప్పినట్టు.. ఓ వానకాలం వచ్చి వెళ్లిపోయినా కాళేశ్వరం ప్రాజెక్టు ఆ వరదల్లో కొట్టుకుపోలేదు. ఇంకా పటిష్ఠంగా నిలబడింది. కాంగ్రెస్ చెప్పేదంతా బూటకమని ఎలుగెత్తి చాటింది. మళ్లీ వానకాలం వస్తున్నది. మళ్లీ నిలబడుతుంది. అందులో అనుమానమే లేదు.

ఇక కేసీఆర్‌కు పీసీ ఘోష్ కమిషన్ నోటీసుల విషయానికి వద్దాం. అసలు ఎందుకీ నోటీసులు? తొండలు గుడ్లు పెట్టే భూములను సస్యశ్యామలం చేసినందుకా? ఒక్క పంటకే నీళ్లు రాని భూముల్లో రెండు పంటలు పండేలా చేసినందుకా? మిషన్ కాకతీయతో చెరువులు తవ్వించి, కాళేశ్వరం నీళ్లతో వాటిని నింపినందుకా? తెలంగాణకు జలసిరి తెచ్చినందుకా? ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం కోసం అహర్నిశలు శ్రమించినందుకా? ఎందుకీ నోటీసులు? కాళేశ్వరంలో అక్రమాలు జరిగాయంటూ ఏడాది కిందట ఏర్పాటుచేసిన ఈ కమిషన్ విచారణ చేస్తూనే ఉన్నది. ఎంతో మంది ఇంజినీర్లను, అధికారులను విచారించింది. కేసీఆర్‌కు వ్యతిరేకంగా, ప్రభుత్వానికి అనుకూలంగా ఎవరైనా.. ఏమైనా చెప్తారేమో.. దాన్ని బట్టి విచారణకు పిలుద్దామన్నట్టు ఇన్ని రోజులు ఆతృతగా ఎదురుచూసింది. ఆఖరికి 'మీరు చెప్పినట్టే చేశామని మీ ఇంజినీర్లు, అధికారులు అంటున్నారు. దీనిపై సమాధానం చెప్పండి' అని ఎట్టకేలకు మొన్న కేసీఆర్‌కు నోటీసులు పంపించింది. కాళేశ్వరంలో నిజంగానే అవినీతి జరిగి ఉంటే.. 'అవినీతి జరిగిందని అధికారులు అంగీకరించారు. సమాధానం ఇవ్వండి' అని ఎందుకు నోటీసులు ఇవ్వలేకపోయింది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతగాకే ఆత్మస్తుతి, పరనిందపై ఆధారపడ్డారు. మాట్లాడితే కేసీఆర్‌ను విమర్శించడం, బీఆర్ఎస్ వల్లే రాష్ట్రం నాశనమైందని ఆరోపించడం తప్పితే, తాము ఏం చేశామో, ఏం చేస్తామో చెప్పలేకపోతున్నారు. ముఖ్యమంత్రి కుర్చీ ఎంతో ప్రతిష్ఠాత్మకమైనది. ఆ కుర్చీని కేసీఆర్ మీద కక్ష తీర్చుకునేందుకు మాత్రమే వాడుకుంటాననుకోవడం అవివేకమే అవుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసింది, వడ్డీలకే ఆదాయమంతా పోతున్నదని సీఎం రేవంత్‌రెడ్డి ఓ వైపు చెప్తూనే ఏడాది కాలంలోనే రూ.లక్షన్నర కోట్ల అప్పు చేశారు. అదేంటని అడిగితే ఆ అప్పుతో వడ్డీ కడుతున్నామంటున్నారు. వడ్డీ కట్టాలంటే మళ్లీ అప్పులు చేయాలన్న ఆర్థిక సూత్రాన్ని ఏ ఆర్థికవేత్త చెప్పారో రేవంత్ రెడ్డికి మరి. సంపద సృష్టి అనే మాటే మరిచిపోయారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల వేళ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల ఊసే ఎత్తట్లేదు.

> బీఆర్ఎస్ పార్టీపై, మా అధినేత కేసీఆర్ కుటిల పన్నాగం పన్నుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రశ్నలకు సమాధానం చెప్తాడా? ఒకవేళ కాళేశ్వరం ప్రాజెక్టే లేకపోయి ఉంటే రాష్ట్రంలోని చెరువులన్నీ ఎండకాలం కూడా నిండుకుండల్లా ఉండేవేనా? బీడు భూముల్లోనూ రైతులు రెండు పంటలు తీసేవారా? పదేండ్ల కిందట ఎడారిలా ఉన్న భూములన్నీ వరి పంటతో పచ్చగా కళకళలాడేవేనా? మరెందుకు కాళేశ్వరంపై ఇన్ని కుట్రలు?

ఎంతసేపూ ఖజానా ఖాళీ అయిందంటున్నారు. తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్‌గా కేసీఆర్ నిలబెడితే, తెలంగాణను అప్పుల రాష్ట్రంగా రేవంత్ రెడ్డి ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దేశ వ్యాప్తంగా దెబ్బతీస్తున్నారు.

ఇక నిరుద్యోగుల విషయానికి వస్తే, అధికారంలోకి వచ్చాక ఒక్క నోటిఫికేషన్ వేయకున్నా 60 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని రేవంత్ ప్రచారం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో పోటీ పరీక్షలు జరిగి, ఇప్పుడు నియామకపత్రాలు ఇస్తూ ఫొటోలకు పోజులిస్తున్నారు. ఎన్నికల ముందు యువతను రెచ్చగొట్టిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు వారి ఆగ్రహాన్నే ఎదుర్కొంటున్నాడు. జాబ్ క్యాలెండర్ ఏదని ప్రభుత్వాన్ని నిలదీయడానికి నిరుద్యోగులు సిద్ధమవుతున్నారు. ఆరు గ్యారెంటీలు ఏవని గ్రామాల్లో ప్రజలు స్థానిక కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారు. సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు నిరసనలు తెలుపుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వాస్తవాలను ఇప్పటికైనా గ్రహిస్తే మంచిది. కేసీఆర్‌పై, బీఆర్ఎస్‌పై నిందలు మాని పాలనపై దృష్టిపెట్టి ముందుకు వెళ్తే ప్రజలు మిగతా మూడున్నరేండ్లు భరిస్తారు. లేకపోతే మధ్యలోనే తరిమేస్తారనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

(వ్యాసకర్త: రాష్ట్ర శాసనమండలి సభ్యులు)



కన్నీటికి తడిసిన వడ్ల రాశి

ముసలెడ్ల మెడపై కాడిమోపి
మొద్దుబారిన కర్రు మొనను
కొలిమిలో మండించి డాకలిమీద సరిచేసి
సాలుకు ఇరువాలు దుక్కిదున్ని
మొలకబోస్తే ముత్యమంత
సంతోషం రైతు ముఖం మీద.

ఆ ముత్యమంత సంతోషం కోసం
రైతుపడే వేదన ఏ కావ్యంలో ఇమడదు
కాలం కలిసొస్తే కాసుల గలగల
కాటేస్తే కన్నీటి వలపోత.

పశువులనమ్మి పుస్తెలమ్మి
తననుతాను అమ్ముకొని
తనతో పాటు చుట్టూ జీవరాసుల
కడుపునింపే రైతన్నపై
కన్నెర్రజేస్తే కటిక హృదయుడే.

నాల్గు నెల్ల పంటకాలం
బిడ్డను కాపాడిన ఇకమతి
కల్లంల వడ్లరాశి మీద వానకురిస్తే
దూలం విరిగి ఇల్లు కూలిన ఎత రైతుది.

ఎండకు ఆరబోస్తారు
గాలి వస్తే మేఘం వైపు చూస్తారు
చినుకులొస్తే పరదాలు కప్పుతారు
ఇంటికొస్తరు హాయి పొందరు
కునుకుదీస్తరు నిద్రపట్టదు
ఎక్కడికిపోయినా రైతన్న మనస్సు
ధాన్యపు కుప్ప చుట్టూ
భూమి తిరిగినట్లు తిరుగుతుంటది

కలుపుదీసినా మందుచల్లి
కోతకోసి కుప్పనూకి కల్లంల రాలిన గింజగింజను
మునివేళ్లతో ముద్దాడి
ధాన్యం సర్కారుకు అమ్మబోతే
వానొచ్చి అంతా కొట్టుకపాయె.

ఓ నేతల్లారా రైతుమీద రాజకీయం చేయకుర్రి
గింజ గింజ వెనుక రాయలేని కథలెన్నో ఉంటయి
రైతు రైతు వెనుక మోయలేని
ఎతలెన్నో దాగుంటయి

అవనిశ్రీ
99854 19424

విదేశాంగ విధానం ధ్వంసం!

భారత విదేశాంగ విధానంపై కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ పూర్వ నేత యశ్వంత్ సిన్హా విమర్శలు గుప్పించారు. విదేశాంగ విధానాన్ని ప్రధాని మోదీ పూర్తిగా తన నియంత్రణలో ఉంచుకోవడం, విదేశాంగ విధానం మొత్తం తన చుట్టూ తిరిగేలా (పర్సనలైజ్) చేయడం వల్ల దేశానికి హాని జరుగుతున్నదని ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ మాజీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్‌తో జరిగిన ఓ ఇంటర్వ్యూలో యశ్వంత్ సిన్హా ఈ విధంగా స్పందించారు. ఆ ఇంటర్వ్యూలో సిన్హా తన మనసులోని పలు భావాలను పంచుకున్నారు. 1971లో బంగ్లా విముక్తి పోరు, 1984లో ఇందిరాగాంధీ హత్య, తదనంతరం రాజీవ్‌గాంధీ భారీ విజయం సాధించడం.. ఆ తర్వాత నవీన భారత్ రూపొందడానికి దోహదం చేసిన రాజకీయ, ఆర్థిక విధానాలపై వారు చర్చించారు.

మోదీ హయాంలో భారత విదేశాంగ విధానాన్ని సిన్హా విమర్శించారు. 'విదేశాంగ విధానాన్ని మోదీ పూర్తిగా పర్సనలైజ్ చేసేశారు. విదేశాంగ మంత్రి జైశంకర్‌కు ఆ స్థాయి లేదు. మాలి రాజధాని టింబక్టూకి తప్ప, మోదీ అన్ని ప్రాంతాలను సందర్శించారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఉంటాడు. మరి ఫలితం ఏది? పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణం ఇచ్చినప్పుడు ఏ దేశం కూడా భారత్‌కు మద్దతు ఇవ్వలేదు' అని సిన్హా తెలపడం గమనార్హం. అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంలో సిన్హా విదేశాంగ శాఖ మంత్రిగా పనిచేశారు. 'దక్షిణాసియాలోని మన పొరుగు దేశాల్లో ఏ ఒక్కరితోనూ మనకు సత్సంబంధాలు లేవు. ఇజ్రాయెల్, తైవాన్, తాలిబన్లతో మాత్రమే మనకు మంచి సంబంధాలు ఉన్నాయి' అని సిన్హా ఎద్దేవా చేశారు.

> బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ పహల్గాం ఘటన జరగడం, ఆ తర్వాత వెంటనే ఆపరేషన్ సిందూర్ చేపట్టడంపై సిన్హా విస్మయం వ్యక్తం చేశారు. ఇదంతా ఎన్నికల జిమ్మిక్కేనని అభిప్రాయపడ్డారు. దేశ భద్రత అంశాన్ని ఎన్నికల్లో లబ్ధి కోసం మోదీ సర్కారు వాడుకుంటున్నదని విమర్శించారు. పుల్వామా, యురి పేరు చెప్పకొని మోదీ ఓట్లు అడిగారని తీవ్రంగా స్పందించారు.

'పహల్గాం ఉగ్రదాడి తర్వాత సమాధానాలు లేని అనేక ప్రశ్నలు మిగిలిపోయాయి. పుల్వామా, యురిలో ఏం జరిగిందో మనకు ఇప్పటికీ స్పష్టత లేదు. పహల్గాం విషయంలోనూ ఇదే జరుగుతుంది. ఉగ్రదాడి చేసిందెవరు? వారు ఏమయ్యారు?' అని సిన్హా ప్రశ్నించారు.

ప్రధాని మోదీ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మీడియా సమావేశాన్ని నిర్వహించకపోవడాన్ని సిన్హా ప్రస్తావించారు. 'మీడియాను మోదీ ఎదుర్కొలేరు. టెలిప్రాంప్టర్ లేకపోతే ఆయన మాట్లాడలేరు' అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ గురించి పదేపదే చెప్పడాన్ని సిన్హాతోపాటు కపిల్ సిబల్ ఎద్దేవా చేశారు. ప్రజలకు కనీసం ట్రిలియన్ అనే



పదానికి అర్థం కూడా తెలియదని, తలసరి ఆదాయం పెంచకుండా ట్రిలియన్ డాలర్ల ఎకానమీ గురించి మాట్లాడటంలో అర్థం లేదని వారు విమర్శించారు.

1971లో బంగ్లా విముక్తి పోరాటం సమయంలో భారత దృక్పథాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేసేందుకు తన రాజకీయ ప్రత్యర్థి అయిన జయప్రకాశ్ నారాయణ్‌ను భారత దౌత్య ప్రతినిధిగా అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ పంపించిన ఘటనను సిన్హా గుర్తుచేసుకున్నారు. 1971 వేసవి కాలంలో ఆరు వారాల వ్యవధిలో మాస్కో, లండన్, హెల్సింకి, వాషింగ్టన్ సహా 16 దేశాల రాజధానులను జయప్రకాశ్ సందర్శించారు. బంగ్లా ఏర్పాటు పట్ల భారత విధానాన్ని ఆయా దేశాలకు వివరించారు. 'జయప్రకాశ్ నారాయణ్‌ను ఇందిరాగాంధీజీ సంప్రదించడం, ఆయన అందుకు అంగీకరించడాన్ని ఎవరైనా ఊహించగలరా? ఆ రోజులే వేరు' అని సిన్హా అన్నారు.

> ఆపరేషన్ సిందూర్ తర్వాత విదేశాల్లో భారత వాణిని వినిపించేందుకు నరేంద్ర మోదీ సర్కారు ప్రతిపక్ష పార్టీలను సంప్రదించకుండానే పలువురు విపక్ష నేతల పేర్లను దౌత్య ప్రతినిధుల జాబితాలో చేర్చింది. ఈ చర్యపై విమర్శలు వచ్చాక ప్రతిపక్ష పార్టీలను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సంప్రదించారు.

భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన తీరుపై కూడా సిన్హా సందేహాలు వ్యక్తం చేశారు. పీవోకే, పాక్‌లో ఉగ్రవాద శిబిరాలను నాశనం చేయడమే భారత్ ఉద్దేశమైతే, అది నెరవేరినప్పుడు వెంటనే ప్రధాని మోదీ ఏకపక్షంగా కాల్పుల విరమణను ఎందుకు ప్రకటించలేదు? ఇదేమైనా 100 మీటర్ల రేసా.. ట్రంప్ వెంటనే ప్రకటించడానికి? అమెరికా పరిపాలనా విభాగం, ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ శాఖ మంత్రి రూబియో మొదటినుంచి ఒకే మాట మీద ఉన్నారు. మోదీ మాత్రం ఈ విషయమై పూర్తిగా నిశ్శబ్దంగా ఉన్నారు' అని సిన్హా విమర్శించారు.

> పాత, కొత్త బీజేపీలను సిన్హా పోల్చారు. పాత బీజేపీ మతోన్మాద పార్టీ కాదని, కొత్త బీజేపీ ప్రజలను విడగొట్టి పాలిస్తున్నదని ఆరోపించారు. పార్లమెంట్‌లో తాను గడిపిన రోజులను గుర్తుచేసుకున్న సిన్హా. ఇప్పటి భారత్ కంటే అప్పటి భారత్‌నే తాను ఇష్టపడతానని చెప్పారు.

'వాజపేయి, చంద్రశేఖర్, పీవీ మంచి మిత్రులు. వారు పార్లమెంట్ సభ్యులుగా ఉన్నప్పుడు సభలో వాడీవేడీ చర్చ జరిగేది. అది అక్కడితోనే ముగిసేది. ఒక్కసారి సభ బయటికి వస్తే, సెంట్రల్ హాల్‌లో వారు నవ్వుతూ మాట్లాడుకునేవారు. సభ వాతావరణం ఎప్పుడూ విషపూరితం కాలేదు. సభ చర్చలో ఎన్నడూ వ్యక్తిగత విమర్శలు, దాడులు జరిగేవి కావు' అని సిన్హా నాటి రోజులను నెమరువేసుకున్నారు. 'యూపీఏ హయాంలో ఒకనాడు తీవ్ర చర్చ జరిగి సభ వాయిదా పడింది. ఆ తర్వాత ప్రతిపక్ష సభ్యుల వద్దకు వచ్చి తాను మరీ ఎక్కువ కఠినంగా మాట్లాడానా? అని ప్రణబ్ ముఖర్జీ అడిగారు. అప్పుడు సాధారణం కంటే ఎక్కువ కోపంగా మాట్లాడావని, సభ మొదలయ్యాక క్షమాపణలు కోరితే అంతా సర్దుకుంటుందని నేను చెప్పాను. ఆయన అలాగే చేశారు. అలాంటి సభా వాతావరణం ఇప్పుడు లేనే లేదు' అని సిన్హా ఆవేదన వ్యక్తం చేశారు.

- ఎడిటోరియల్ డెస్క్



అమెరికాలోనే చెయ్యాలె!

అమెరికాలో విక్రయించే ఐఫోన్లను అమెరికాలోనే తయారు చేయాలి. భారత్‌లోనో, మరే ఇతర దేశంలోనో కాదు. ఈ విషయాన్ని యాపిల్ సీఈవో టిమ్ కుక్‌కు గతంలోనే చెప్పా. అలా కుదరదంటే అమెరికాకు ఆ కంపెనీ కనీసం 25 శాతం పన్నులు కట్టాల్సిందే.

- డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు

ఎన్నాళ్లీ కమిషన్ల కహానీ

కాళేశ్వరం ప్రాజెక్టుపై తమ ఎదుట విచారణకు హాజరు కావాలని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఇది ఊహించిన పరిణామమే. కేసీఆర్‌నే లక్ష్యంగా చేసుకొని రాజకీయ కక్షసాధింపులో భాగంగా ఈ కమిషన్ ఏర్పాటైనట్టు ముందే దేశమంతటికీ అర్థమైంది. 2024 మార్చిలో ప్రారంభమైన విచారణలో చివరకి 14 నెలల తర్వాత లక్ష్యం మేరకు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. దేశంలో కమిషన్ల కథలు అందరికీ తెలిసినవే. అదే కోవలోనే ఈ కమిషన్ విచారణ సాగింది.

డాక్టర్ బీఎన్‌రావు

ఇప్పటివరకు అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ప్రాజెక్టుతో సంబంధం లేనివారిని పిలిపించారు. ప్రభుత్వం ఆశించిన విధంగానే చాలామంది సమాచారం ఇచ్చినట్టు తెలుస్తున్నది. వాటితోనే విచారణ ముగుస్తున్నదని భావిస్తున్న తరుణంలో కేసీఆర్, హరీశ్‌రావు, ఈటలకు పిలుపు అందింది.

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాలను ఒడిసిపట్టి తెలంగాణ భూములను పారించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టు ఇది. అంతా శుభారంభమే అయినా.. ఆ తర్వాత మేడిగడ్డ వద్ద బ్యారేజీ కుంగడం, ఆ తర్వాత ప్రభుత్వం మారిపోవడం, కమిషన్ ఏర్పాటు వంటి పరిణామాలు జరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టును నిరర్థకంగా మార్చే ప్రయత్నం జరిగింది తప్ప మేడిగడ్డ బ్యారేజీని బాగుచేయించి దాన్ని కొనసాగించాలనే ప్రయత్నం చేయలేదు. ఆ ఉద్దేశం ప్రభుత్వంలో ఏ కోశానా లేదు. ఎల్ అండ్ టీ ముందుకు వచ్చి ఉచితంగా మరమ్మతులు చేస్తామన్నా అనుమతులు ఇవ్వలేదు. ఒక్క పిల్లర్ కుంగిపోతేనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ప్రాజెక్టు మొత్తం కూలిందనే వాదన చేస్తూ దాన్నే కొనసాగిస్తున్నారు. మిగిలిన రిజర్వాయర్లనూ వినియోగించడం లేదు. సాగు నీటి కొరత వల్ల లక్ష ఎకరాలకు పైగా పంటలు ఎండిపోయినా వారిలో చలనం రాకపోవడం శోచనీయం.

తెలంగాణకు గోదావరి జలాలు ప్రాణప్రదమైనవి. వాటిని అన్నివిధాలా వినియోగించుకోవాలి. కాళేశ్వరం ఆనవాళ్లు లేకుండా చేయాలనే తపన తప్ప, కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించి రైతులను బాగుపరిచే ప్రత్యామ్నాయాలేవీ కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేదు. ఇదెంత విషాదం? తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తామని చెప్పినా దానిపై అడుగు ముందుకేయలేదు. రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం కమిషన్‌ను వాడుకుంటున్నదనే విషయం అంతిమంగా అర్థమవుతున్నది. కేంద్ర ప్రభుత్వం సైతం ఈ ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని గుర్తించి దాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు సలహా సూచనలు ఇవ్వకపోగా చోద్యం చూస్తున్నది. నేషనల్ డ్యామ